## పంచాయతీ కార్యదర్శి మృతికి సంతాపం

మందమర్రిరూరల్, మే 28 : జన్నారం మండలంలోని ఇందన్‌పల్లి పంచాయతీ కార్యదర్శి గుండెపోటుతో మృతిచెందడం పట్ల బుధవారం మందమర్రి మండల ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు సంతాపం ప్రకటించారు. ఆర్థిక భారం, పని ఒత్తిడితోనే మరణించాడని ప్రభుత్వం ఆయన కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పిడుగుపాటుతో బర్రెలు మృతి



పిడుగుపాటుకు మృతిచెందిన బర్రె

జైపూర్, మే 28: మండలంలోని శెట్‌పల్లి గ్రామంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి పిడుగుపడి గ్రామానికి చెందిన తుంగపిండి రాజేశ్‌కు చెందిన రెండు బర్రెలు మృతిచెందాయి. బర్రెల విలువ సుమారు రూ.2లక్షలు ఉంటుందని, ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 'సాగు భూములను వదులుకోం'

ఖానాపూర్, రూరల్ 28 : మా ప్రాణాలు వదులుకుంటాం కానీ సాగు భూములను వదులుకోమని రైతులు మొరపెట్టుకున్న అటవీ శాఖ అధికారులు వినకుండా సాగు భూముల్లో రెండు రోజులుగా కందకాలు తవ్వుతున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని తర్లపాడు శివారులో పోడు రైతులపై అటవీ శాఖ అధికారులు జులుం చూపిస్తున్నారని బాధిత రైతులు వాపోతున్నారు. 20 ఏండ్లుగా సాగులో ఉన్న భూముల్లో ట్రేంచ్, మొక్కల పెంపకానికి తవ్వకాలు చేపడుతున్నారని, తమ గోడును వినిపించుకోవడం లేదని అవేదన వ్యక్తం చేశారు. పిల్లపాపలతో సహా 10 మంది కుటుంబాలు అక్కడికి చేరుకొని ఇదేమి దౌర్జన్యం అంటూ అటవీ శాఖ అధికారులపై తిరగబడ్డారు. బాధిత కుటుంబాలకు మద్దతుగా రైతు సంఘాల నాయకులు అక్కడి చేరుకొని పనులు అడ్డుకున్నారు. అధికారులు సాగు భూముల్లో కందకాలు తవ్వుతూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ సీపీఎం నాయకులు నంది రామయ్య, దుర్గం నూతన్, తిరుపతి, శంభు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

**CHANGE OF NAME**

By This Deed I,The under Signed MAJID CHOTI MIYA S/o CHOTI MIYA R/o. H.No. 3-5-104/105/1,Choudari galli Bhainsa (Vill), R/M Bhainsa Dist,Nirmal.504103 Telangana. I Changed My Name From MAJID S/o CHOTI MIYA to **MAJID CHOTI MIYA S/o CHOTI MIYA** For all Future Pupose.

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## పోడు రైతులకు బ్యాంకు రుణాలివ్వాలి



మేనేజర్‌కు వినతి పత్రం ఇస్తున్న సంఘం నాయకులు

వేమనపల్లి, మే 28 : మండలంలోని పోడు రైతులందరికీ బ్యాంకు రుణాలివ్వాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాగాల రాజన్న, ఎర్మ పున్నంలు డిమాండ్ చేశారు. రుణాలివ్వాలని కోరుతూ బుధవారం వేమనపల్లి తహసీల్ కార్యాలయం నుంచి తెలంగాణ గ్రామీణ బ్యాంకు వరకు ర్యాలీ తీశారు. అనంతరం బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందించారు. మే నెల మొదటి వారంలో పోడు రైతులకు క్రాప్ లోన్ ఇస్తామని చెప్పిన బ్యాంకు అధికారులు ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇప్పటికైనా రుణాలివ్వకపోతే కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలు మర్మల మల్లేశ్వరి, నాయకులు తలండి ముత్తయ్య, మండల అధ్యక్షుడు మడె మధునయ్య, మొండి, కిరణ్, నారాయణ, గంగారం, పార్వతి, పోశం, మల్లయ్య, రైతులు పాల్గొన్నారు.

## 'రైతుల భూముల జోలికి వస్తే సహించం'

వేమనపల్లి, మే 28 : పేద రైతుల భూముల జోలికి వస్తే సహించబోమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ అన్నారు. బుధవారం మండలంలోని చామనపల్లిలో ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం చామనపల్లి రైతులు జిల్లా కలెక్టర్‌ను కలిసి బాధలు చెప్పగా స్పందించిన ఆయన జైపూర్ ఏసీపీకి, నీల్వాయి ఎస్ఐకి ఫోన్ చేసి అటవీ అధికారులపై కేసు నమోదు చేసి జైలుకు పంపాలని ఆదేశించారని, కానీ ఇప్పటికి పోలీసులు అటవీ అధికారులపై కేసులు నమోదు చేయలేదన్నారు. పోలీసులు అటవీ అధికారులను కాపాడే ప్రయత్నాలు చేస్తున్నట్లు అనుమానం వస్తుందన్నారు. వెంటనే అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు భూములు సాగుచేసుకునేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కేశవరెడ్డి, రైతులు బానయ్య, లింగయ్య, పర్వతాలు, లక్ష్మణ్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 3 నుంచి ఎస్సెస్సీ సప్లిమెంటరీ పరీక్షలు

నస్పూర్, మే 28 : జిల్లాలో జూన్ 3వ తేదీ వరకు పదవ తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. జూన్ 3, 4, 5, 6, 11, 12, 13 తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 9, 10 తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. పరీక్షల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

## అనుమతి లేని పాఠశాలలను మూసివేయాలి

నస్పూర్, మే 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇండ్లనే పాఠశాలలుగా మార్చి లండన్ కిడ్స్, స్వామి వివేకానంద పేరుతో ఎలాంటి అనుమతి లేకుండా అడ్మిషన్లు చేస్తున్న వీటిని మూసివేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ పేర్కొన్నారు. బుధవారం డీఈవో యాదయ్యకు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ విద్యాశాఖ అధికారులకు తెలియకుండా పోస్టర్ల, బ్యానర్లు ఏర్పాటు చేసి అడ్మిషన్లు చేస్తూ వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నాయని, తల్లిదండ్రులను దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి అనుమతులు లేని పాఠశాలలను మూసివేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

## డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

మందమర్రిరూరల్, మే 28 : మందమర్రి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన రవీందర్ పెద్దపల్లి తహసీల్ కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో పెద్దపల్లి తహసీల్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన సంతోష్ మందమర్రి మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని, అందుబాటులో ఉండి సేవలందిస్తానని తెలిపారు.

## స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

నస్పూర్, మే 28 : స్పోర్ట్స్ అకాడమీలో ప్రవేశాల ఎంపిక కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని జిల్లా క్రీడా యువజన సేవల శాఖ అధికారి కీర్తీ రాజ్‌వీరు ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర అకాడమీలో ప్రవేశం దరఖాస్తులు స్వీకరించేందుకు జూన్ 1న సిద్దిపేటలోని వాలీబాల్ అకాడమీలో 10న రాజన్న సిరిసిల్లలోని వాలీబాల్ అకాడమీలో, 10,11 తేదీల్లో ఓయూ క్యాంపస్ లోని సైక్లింగ్ వెల్‌డ్రోమ్‌లోని సైక్లింగ్ అకాడమీలో 12, 13న మహబూబ్ నగర్‌లో కౌంటర్లను ఏర్పాటు చేస్తామని తెలిపారు. అభ్యర్థులు సర్టిఫికెట్లు, స్పోర్ట్స్ సంబంధిత ధృవపత్రాలతో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాల కోసం 9963539234లో సంప్రదించాలనిఇ సూచించారు.

## నకిలీ ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే కేసులు



ఎరువుల దుకాణాల్లో తనిఖీ చేస్తున్న సీఐ దేవేందర్‌రావు

చెన్నూర్, మే 28: రైతులకు నకిలీ ఎరువులు, విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని సీఐ దేవేందర్‌రావు వ్యాపారులను హెచ్చరించారు. చెన్నూర్ పట్టణంలోని ఎరువులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం తనిఖీ చేశారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు తప్పకుండా రసీదులు ఇవ్వాలని తెలిపారు. పలు దుకాణాల్లోని రికార్డులను పరిశీలించారు.

## కొర్రమీను పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

మంచిర్యాల (ఏసీసీ), మే 28: జిల్లాలోని మత్స్య పరిశ్రమలో పని చేస్తున్న అర్హులైన వార నుంచి కొర్రమీను చేపల పెంపకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాశ్ బుధవారం తెలిపారు. జిల్లాలోని ఔత్సాహికులు, మత్స్య రైతులు, హోల్ సేల్, రీటైల్ చేపల విక్రయదారులు, చేప పిల్లల ఉత్పత్తిలో ఆసక్తి గలవారు ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జిల్లాను కొర్రమీనుల క్లస్టర్ గా ఏర్పాటు చేసినందున ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజనలో భాగంగా ఎస్సీ, ఎస్టీ, మహిళా కేటగిరీలో 60 శాతం రాయితీపై 3 హేచరీ యూనిట్లు, 10 హెక్టార్ల చేప పెంపకం చెరువులు మంజూరు చేస్తామని తెలిపారు. మరిన్ని వివరాల కోసం కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## కలెక్టర్‌ను కలిసిన 4వ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు

హాజీపూర్, మే 28 : మంచిర్యాల జిల్లా కేంద్రంలో కలెక్టర్ కుమార్ దీపక్‌ను నూతనంగా ఎన్నికైన నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. తెలంగాణ 4వ తరగతి ఉద్యోగుల మంచిర్యాల నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్న సందర్భంగా మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు గీట్ల సుమీత్, జిల్లా కార్యదర్శి కవితారాణి, కోశాధికారి సుజాత, జిల్లా కార్యవర్గ సభ్యులందరూ కలిసి కలెక్టర్‌కు సంఘం ప్రొసిడెంగ్ కాపీని అందించారు. పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు, ఆఫీస్ సబార్డినేటర్లు పాల్గొన్నారు.

# బిల్లులు ఇస్తేనే పనులు చేస్తాం

- నెలలు గడుస్తున్నా చెల్లించకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న కాంట్రాక్టర్లు
- వెంటనే ఇప్పించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేత



మందమర్రి మున్సిపల్ కమీషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న కాంట్రాక్టర్లు.

మందమర్రి, మే 28: మందమర్రి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ప్రభుత్వం తమకు బిల్లులు చెల్లించడం లేదని, ఇప్పటికైనా ఇవ్వకపోతే భవిష్యత్‌లో ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టబోమని కాంట్రాక్టర్లు అన్నారు. నిబంధనల మేరకు మున్సిపాలిటీలో నిర్వహించిన టెండర్లలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు నిబద్ధతతో చేపట్టిన పనులను పూర్తి చేసి నేడు ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారు. తాము చేసిన పనులకు సంబంధించిన బిల్లులను చెల్లించాలని కోరుతూ బుధవారం మందమర్రి మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగుకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీలో పీపీజీ గ్రాంట్ కింద సుమారు రూ.90 లక్షల విలువైన అభివృద్ధి పనులు అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన కొందరు కాంట్రాక్టర్లు దక్కించుకుని పూర్తి చేశారు. పనులు పూర్తి చేసి 18 నెలలు గడుస్తున్నా బిల్లులను చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుండడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని వాపోతున్నారు. పనులన్నీ నిర్దేశిత ప్రమాణాల మేరకు పూర్తి చేసి అందుకు సంబంధించిన డాక్యుమెంటేషన్‌ను సమర్పించినట్లు పేర్కొన్నారు. పనుల నిర్వహణకు బ్యాంకు రుణాలు పొందిన తాము అందుకు వడ్డీ, కార్మికులకు వేతనాలు, పనులు చేసేందుకు వాడిన సిమెంటు, ఇసుక తదితర మెటీరియల్‌కు చెల్లింపులు చేశామని తెలిపారు. తగిన సమయంలో బిల్లులు చెల్లించక పోవడంతో తాము ఆర్థికంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఇలాగే కొనసాగితే భవిష్యత్‌లో కాంట్రాక్టర్లు ఎవరూ ప్రభుత్వ అభివృద్ధి పనులు చేపట్టబోరని తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమ ఇబ్బందులను గుర్తించి పెండింగ్‌లో ఉన్న తమ బిల్లులను చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టర్లు కొంగల తిరుపతి రెడ్డి, దుర్గం ప్రభాకర్, బోరిగం వెంకటేశ్, వేల్పుల కిరణ్, రాకం సంతోశ్, ఆర్.వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలి

- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

నస్పూర్, మే 28 : ప్రభుత్వం చేపట్టిన రాజీవ్ యువ వికాసం ద్వారా రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించడం జరుగుతుందని, అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకంగా వ్యవహరించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర ఉన్నత అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లతో రాజీవ్ యువ వికాసం పై సమీక్షా సమావేశం నిర్వహించారు. యువ వికాసం పథకంలో రూ 50 వేల నుంచి లక్ష రూపాయల యూనిట్ వరకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం వేడుకల్లో మొదటి విడుత మంజూరు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అర్హులైన వారి జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి అందించాలని, జూన్ 2న లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మోతీలాల్, అధికారులు దుర్గాప్రసాద్, కిషన్, తిరుపతి, రాజేశ్వరి, జనార్దన్ , పురుషోత్తం పాల్గొన్నారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టరేట్‌లో..**

జిల్లా కేంద్రంలోని ఆసిఫాబాద్‌లోని కలెక్టరేట్‌ను కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకంలో రూ.50 వేల లోపు గల యూనిట్ల కోసం అర్హులైన వారి జాబితాను జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంతకాలు తీసుకుని జూన్ 2న అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో దత్తారావు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి సజీవన్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్లు

చెన్నూర్ రూరల్/చెన్నూర్ టౌన్, మే 28: చెన్నూర్ మండలంలోని గ్రామపంచాతీల కార్యదర్శులు గ్రామస్తులకు అందుబాటులో ఉండాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. చెన్నూర్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీలతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. క్లోరినేషన్, శానిటేషన్ నిర్వహణతో పాటు ఇంటి పన్ను, నర్సరీల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మోహన్, ఎంపీవో అజ్మత్ అలీ, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

## చేపల వ్యాపారుల మధ్య గొడవ

సీసీసీ నస్పూర్, మే 28: నస్పూర్ పట్టణంలోని సీసీసీ కార్నర్ సమీపంలో చేపల వ్యాపారుల మధ్య బుధవారం గొడవ చెలరేగింది. కొన్ని నెలలుగా కొంత మంది ఇక్కడ చేపలు వ్యాపారం కొనసాగిస్తున్నారు. మొదట్లో కొంత మంది మాత్రమే ఇక్కడ అమ్మకాలు చేపట్టగా, ప్రస్తుతం అమ్మకందారుల సంఖ్య పెరిగిపోయింది. ఇష్టమొచ్చిన ధరలకు చేపలు అమ్ముతున్నారంటూ వీరి మధ్య గొడవ జరిగింది. కొత్తవారు వచ్చి ఇక్కడ చేపల వ్యాపారం చేయవద్దని ఇరువురి వాగ్వాదం జరిగింది. తాము గోదావరి నుంచి స్వచ్ఛమైన చేపలను తీసుకువచ్చి ప్రజలకు అమ్ముతుంటే, కొందరు ఐస్‌లో పెట్టిన నాణ్యతలేని చేపలను తీసుకు వచ్చి తక్కువ ధరకు అమ్మడంతో తమ చేపలు అమ్ముడుపోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. చివరికీ ఇరువర్గాల వారు చేపల విక్రయాన్ని బంద్ చేసి వెళ్లి పోయారు.

## సెల్ ఫోన్ అందజేత

హాజీపూర్, మే 28 : హాజీపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కర్నమామిడి గ్రామానికి చెందిన జునగరి భీమరాజుసెల్ పోగొట్టుకోవడంతో హాజీపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. వర్టికల్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ రాజేందర్ సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్‌ను రికవరీ చేశారని ఎస్ఐ స్వరూప్ రాజ్ తెలిపారు. దొరికిన సెల్‌ఫోన్‌ను బాధితుడికి బుధవారం అందజేశామన్నారు. సెల్‌ఫోన్ రికవరీలో కీలక పాత్ర పోషించిన టెక్‌టీం వర్టికల్ అధికారి రాజేందర్‌ను అబినందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నట్లయితే సీఈఆర్ పోర్టల్ ద్వారా నంబర్‌ను www.ceri.gov.in వెబ్‌సెట్‌లోపూర్తి వివరాలను నమోదు చేసినట్లు అయితే రికవరీ చేస్తామని తెలిపారు.

# నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలి

- ప్రజా ఉద్యమాల పోరాట సమితి అధ్యక్షురాలు విమలక్క



మాట్లాడుతున్న విమలక్క

చెన్నూర్, మే 28: ప్రభుత్వం నక్సలైట్లతో శాంతి చర్చలు జరపాలని, ఆదివాసీ గిరిజనులపై మారణ హోమాన్ని ఆపాలని అరుణోదయ కళాకారిణి, ప్రజా ఉద్యమాల పోరాట సమితి అధ్యక్షురాలు విమలక్క అన్నారు. వామపక్షాల ఆధ్వర్యంలో చెన్నూర్ పట్టణంలోని పద్మశాలీ భవనంలో బుధవారం ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ నక్సలైట్ల పేరుతో అమాయక ఆదివాసీలను బూటకపు ఎన్‌కౌంటర్లు చేయవద్దన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడుతూ, కనీసం శవాలను కూడా బంధుమిత్రులకు అప్పగించకుండా సాగిస్తున్న ఎన్‌కౌంటర్లపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆమె డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మల్లికార్జున్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గంట సత్యం, రాష్ట్ర కార్యదర్శి కే విశ్వనాథ్, ఆదివాసీ నాయకుడు ఈ కుమార్, ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పోచమల్లు, సీపీఐఎంఎల్ రాష్ట్ర నాయకులు ప్రసాద్, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు రేగుంట చంద్రశేఖర్, సీపీఐ నాయకులు ఫౌలు, నెన్నల సమ్మయ్య పాల్గొన్నారు.

## రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి


**ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**

ఆసిఫాబాద్ టౌన్, మే 28: రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లా అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం.డేవిడ్, జిల్లా అటవీ అధికారి నీరజ్ కుమార్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా ఆర్డీవో లోకేశ్వర్ రావు లతో కలిసి ఆవిర్భావ దినోత్సవ వేడుకల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జూన్ 2న నిర్వహించే రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.అనంతరం అధికారులతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో వేడుకల నిర్వహణ స్థలాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేపటి నుంచి గ్రామ సభలు

హాజీపూర్, మే 28 : మండలంలోని గ్రామాల్లో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో 2024-2025 సంవత్సరానికి ఆయా గ్రామాల్లో నిర్వహించిన పనులను పరిశీలించి గ్రామ సభలను నిర్వహించనున్నారు. ఈ నెల 30న మండలంలోని చిన్నగోపాల్‌పూర్, టీకన్నపల్లె గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఉదయం 9 గంటలకు గ్రామ సభను నిర్వహిస్తారు. 31న ర్యాలీ, ముల్కల్ల, హాజీపూర్, వేంపల్లి గ్రామాల్లో, జూన్1న పెద్దంపేట, కర్నమామిడి గ్రామాల్లో, 2న గఢ్‌పూర్ గ్రామంలో, 3న పడ్తన్‌పల్లి, బుద్దిపల్లి గ్రామాల్లో, 4న రాపల్లి, దొనబండ, గుడిపేట, నంనూర్, నర్సింగాపూర్, నాగారం గ్రామాల్లో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ప్రసాద్, ఏపీవో మల్లయ్య తెలిపారు.

# అ'పూర్వ' సమ్మేళనం



సమావేశంలో 1972-73 బ్యాచ్ పదవతరగతి పూర్వ విద్యార్థులు

జన్నారం, మే 28 :మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో 1972-73 సంవత్సరంతో పదవతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు 52 సంవత్సరాల తర్వాత బుధవారం స్థానిక వైశ్యభవనంలో సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జక్కు సత్తయ్య, తడుకల కమలాకర్‌రావుతో పాటుగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

## సేంద్రియ పద్ధతిలో పంట సాగు చేయాలి



మాట్లాడుతున్న రైతు సంఘం అధ్యక్షుడు బాలాజీ

కెరమెరి, మే 28: రైతులు సేంద్రియ పద్ధతిలో పంటల సాగు చేయాలని రైతు సంఘం అధ్యక్షుడు కేంద్రే బాలాజీ అన్నారు. బుధవారం మండలంలోని కొలాం కొటారి గ్రామంలో సేంద్రియ ఉత్పాదక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సేంద్రియ పద్ధతిలో ఆహార పంటలైన జొన్నలు, మక్కలు, పెసర్లు, మినుములు, కాయగూరలు పండించాలని సూచించారు. రసాయన మందులు పిచికారీ చేయకుండా సేంద్రియ పద్ధతులైన ఆవు పేడ, గోమూత్రంతో జీవామృతం, పంచగవ్వ లాంటి ఎరువులు వాడితే పంటల దిగుబడి పెరగడమే కాకుండా ఆరోగ్యానికి ఎంతో ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి రాంచందర్, మహదు గ్రామరైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

ఆసిఫాబాద్ టౌన్, మే 28: జిల్లాలోని గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం అని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో స్వచ్ఛ భారత్ మిషన్, అగా ఖాన్ పౌండేషన్ వారి ఆధ్వర్యంలో ఆసిఫాబాద్, తిర్యాణి మండలాల మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సెర్ప్ ఎ.పి.ఎం., ఉపాధి హామీ పథకం ఏపీఎం, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయితీలను ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర చాలా కీలకమని అన్నారు. ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపట్టడం, తడి చెత్త, పొడి చెత్తలు సేకరించడం, మురికి నీరు నిలువ లేకుండా చర్యలు, రహదారుల శుభ్రత, ప్రతి ఇంటింటికి ఇంకుడు గుంతల నిర్మాణం, మురుగు కాలువల శుభ్రత తదితర పనుల నిర్వహణతో గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా చేయవచ్చని, ఆ దిశగా ప్రజలకు అవగాహన కల్పించి చైతన్యవంతులను చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, ఎస్ఐ. ఆర్డీ రాష్ట్ర సమన్వయకర్త సుభాష్, యూనిసెఫ్ ప్రతినిధి మహాలక్ష్మి, రాష్ట్ర శిక్షకులు రమేష్, అగా ఖాన్ ఫౌండేషన్ ప్రతినిధులు నజీర్, సెల్వరాజ్, కిరణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తాం

దహెగాం,మే28: ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి మరిన్ని నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. దహెగాం ప్రెస్‌క్లబ్‌కు అదనపు గదుల నిర్మాణానికి ఎంపీ నిధులు రూ.5లక్షలు మంజూరు కాగా నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ విక్రమ్,బ్యాంక్ మేనేజర్ నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పార్టీల నాయకులు, పాత్రికేయులు, తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ సేవలు

ఆసిఫాబాద్ టౌన్, మే 28: జిల్లా కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో జూన్ 2 నుంచి స్లాట్ బుకింగ్ సేవలు అందుబాటులోకి రానున్నట్లు సబ్ రిజిస్టర్ అప్పారావు బుధవారం ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ 48 స్లాట్ బుకింగ్ లకు అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు 24 స్లాట్లు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు 24 స్లాట్ లు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ-సిగ్నేచర్ అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. దీంతో అక్రమాలకు తావు లేకుండా ఉంటుందన్నారు స్లాట్ బుకింగ్ లేనివారికి సాయంత్రం ఐదు నుంచి ఆరు గంటల మధ్యలో రోజుకి ఐదు రిజిస్ట్రేషన్లను మాత్రమే చేస్తామని తెలిపారు. registration.telangana.gov.in ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు.

## తహసీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ఆసిఫాబాద్ టౌన్/కౌటాల/కెరమెరి/వాంకిడి,మే 28 : ఆసిఫాబాద్ తహసీల్దార్‌గా రియాజ్ అలీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి పని చేసిన రోహిత్ దేశ్ పాండే ఇటీవల మంచిర్యాలకు బదిలీపై వెళ్లారు. రియాజ్ అలీ ఇందుకు ముందు వాంకిడిలో పని చేసి బదిలీపై వచ్చారు. సిర్పూర్ (టీ) మండల తహసీల్దార్‌గా రహీముద్దీన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కెరమెరి మండల తహసీల్దార్‌గా నరెందుల భూమేశ్వర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు పని చేసిన దత్తు ప్రసాద్‌రావు పెద్దపల్లికి బదిలీపై వెళ్లారు. భూమేశ్వర్ గతంలో బెజ్జూర్‌లో పని చేసి బదిలీపై వచ్చారు. వాంకిడి తహసీల్దార్‌గా డీ కవిత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన తహసీల్దార్ ఎండీ రియాజ్ అలీ బదిలీపై ఆసిఫాబాద్ వెళ్లగా, కవిత దహెగాం నుంచి బదిలీపై వచ్చారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

రెబ్బెన, మే 28: వాంకిడి మండలం జైత్‌పూర్‌కు చెందిన కోలే సక్కయ్య(73) రెబ్బెన మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు రెబ్బెన ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..వాంకిడి మండలం జైత్‌పూర్ గ్రామానికి చెందిన కోలే సక్కయ్య వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నాడు. బుధవారం రోజున అందవెల్లి గ్రామంలో బంధువుల ఇంటికి బైక్‌పై వెళ్తున్నాడు. కాగజ్‌నగర్ వైపు నుంచి కారు అతి వేగంగా వచ్చి వంకులం గ్రామ సమీపంలో గల బ్రిడ్జి దగ్గర సక్కయ్య బైక్‌ను ఢీకొట్టింది. సక్కయ్యకు తీవ్రగాయాలవడంతో 108 అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సక్కయ్య కుమారుడు గణపతి ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

## మున్నూరుకాపు ఎన్నికలకు సన్నద్ధం కావాలి

రెబ్బెన, మే 28: జూన్ చివరి వారంలో మున్నురుకాపు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికలు జరుగనున్నాయని ఎన్నికలకు సన్నద్ధం కావాలని మున్నురుకాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బోరిగాం రాజారా తెలిపారు. రెబ్బెన మండల కేంద్రంలో బుధవారం మున్నురుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెన్న సోమశేఖర్, ఆకుల సత్తయ్య లతో కలిసి మాట్లాడారు. మున్నూరుకాపులు అందరూ ఐకమత్యంతో ఉండి హక్కులు సాధించుకోవాలన్నారు. మున్నూరుకాపులను సమన్వయం చేసేందుకు మండలాల్లో పర్యటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మున్నూరు కాపు సంఘం నాయకులు పుప్పాల శ్రీనివాస్, అన్నం రమేశ్, తిరుపతి, సాయిసుప్రజ్, శ్రీకాంత్ ఉన్నారు.

## అంబులెన్స్‌లో గర్భిణి ప్రసవం

కెరమెరి, మే 28: మండలంలోని బాబేఝరి గ్రామానికి చెందిన శ్రావణి అనే గర్భిణి బుధవారం అంబులెన్స్‌లో ప్రసవమైంది. ఉదయం ఆమెకు పురిటినొప్పులు రాగా కుటుంబ సభ్యులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సిర్పూర్(యూ)కు చెందిన అంబులెన్స్ ఆమెను జైనూర్ దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో పురిటినొప్పులు ఎక్కువయ్యాయి. దీంతో ఈఎంటీ ప్రవీణ్‌కుమార్, పైలట్ సాయినాథ్ గర్భిణికి చికిత్స అందించడంతో ప్రసవించింది. మగబిడ్డ, తల్లిని జైనూర్ దవాఖానకు తరలించి వైద్యసేవలందించారు.